"డబ్బు చేతిలోలేక పత్రిక ఆగిపోయేదశలో వుందనీ, మళ్ళీ మిత్రుల దర్శనానికి రా దల్చు కొన్నాననీ, అభిప్రాయం తెలియచేయమనీ" రాశాడు.

ఇలా నే, ఇదివరకు వీడిపత్రికకి నేనుతంటాలు పడి, పల్లెల్లో మిత్రుల దగ్గర బిచ్చమెత్తి ఐదు వందల రూపాయలు సహాయంచేస్తే, ఆ డబ్బుకు తనదగ్గరున్న కొద్దిపాటి మొత్తంతోకలిపి, చెల్లెలి పెళ్ళికి ఖర్చుపెట్టి, ఆర్నెల్లు పత్రికని అచ్చు వెయ్యలేదు. వాడు చెల్లెలి పెళ్లికి నాకుపంపిన శుభ లేఖ మీది పోస్టింగ్ డేట్ చూస్తే పెళ్ళయిన మూడోనాడు పోస్టు చేసినట్టు బుజువయింది. ఇంతకంటే మోసం ఇంకేం కావాలి? ఈమధ్య మళ్ళీ పత్రిక నడుస్తున్నదనీ, క్షమించమనీ రాస్తే నేను జవాబీయలేదు. మళ్ళీ ఇవాళ ఈ ఉత్తరం. ఇదివరకు చేసిన పనికి కనీసం వాడు సిగ్గు పడుతూన్నట్టుకూడా కనపడదు. ఇక నేనేమనుకోను?

నాకూ, ఇంకా వందలాది ప్రజలకీ ఇలాగైలు దగ్గరకీ, పోస్టాఫీసుకూ, పార్కుకూ రావడం ఎలాంటి నిత్యకృత్యాల్లో, మా వెంకటేశ్వర్లుకి కూడా ఎవణ్ణో ఒకణ్ణి ఇలాంటివాణ్ణి పట్టుకొని డబ్బుచేసుకోవటం నిత్యకృత్యమేనేమో ననుకుంటాను.

చాలా టైమైంది. ఆఫీసుకు ఆలస్యం అవుతోందనే తొందరలో. అలవాటు ప్రకారం కాళ్ళు చురుకును తెచ్చుకుంటున్నాయ్.

---

కథానిక

# ఎండమావులు

ఆర్. యం. చిదంబరం

మున్సిపల్ సైరన్ పన్నెండు గంటల కేక కూసింది. కెవ్వున కేకతో భూమిమీద పడింకొకజీవి. బయట "ఏమౌతుందో-ఇంకేమౌతుందో" అని ఆరాట పడుతూ పచారుచేస్తున్న తండ్రికి "మగపిల్లాడు" అని నర్సు అనే సరికి ఎక్కడలేని సంతోషం పుట్టుకొచ్చింది. అనంత కాలంలో లభించే "ఆనంద"మనే దాన్ని అతను అనతికాలంలో అనుభవించాడు. ఇక పసిడిపలుకుల మిసిమితనాన్ని విని జగాన్నే మరవాలనుకున్నాడు.

అంతా సక్రమంగా జరిగింది. దినాలు చకచకా దొర్లిపోయాయి. కాని పిల్లాడికి పేరుపెట్టడమే దగ్గర తలిదండ్రులకు పేచీ వచ్చింది. తన తండ్రిపేరు పెట్టుకుంటానంటుంది తల్లి. "మా నాన్నపేరు పెడతా"నంటాడు తండ్రి. సంప్రదాయాన్ని త్రోసిరాజంటూ వాదించుకున్నారు.

ముసలమ్మ వచ్చి ఇద్దరికీ రాజీ కుదిర్చింది! "ఆయనపేరే పెట్టనీవే కోడలా! నువ్వు ముద్దుగా మీ నాన్నపేరుతో పిలుచుకో. బాగుంటుంది" అనుభవశాలి ఆలోచనకు ఇద్దరూఅంగీకార సూచకంగా తలలూచారు "రమణ" అన్న పేరు కుర్రాడికి యింట్లో సార్థకమయింది.

రమణ జీవితం చకచకా దొర్లుకొంది. పసిపాపల వింత ఆటలతో, తెలిమల్లెపూల చిరునవ్వులతో. కేరింతలతో నాలుగేళ్లు గిర్రునతిరిగాయి. వాళ్ళనాన్న రమణకు సిల్కుచొక్కాలు కట్టించాడు. గ్లాస్కోజు బిస్కత్తులు కొనితెచ్చాడు. ఆత్మాదరంతో ప్రేమించాడు. కంటికి రెప్పలా కాపలికాచాడు. తలిదండ్రులిద్దరూ బిడ్డను సమానాదరంతో ప్రేమిస్తున్నారు కనుక అతని విషయమై వారిద్దరి మధ్య పోట్లాటలేదు.

రమణ ఓనాడు ద్రాక్షపళ్లు తిన్నాడు. అది దేవామృతంలా కనిపించింది. జీవితాంతం వరకు అదొక యిష్టవస్తువుగా ఉండిపోయింది. ఒకనాడు బొమ్మల కొలువుకని వాళ్ళనాన్న బజారునుండి కొన్ని లక్కసామాన్లు తెచ్చాడు. వాటిలో ఓ ద్రాక్షపళ్ళగుత్తి ఉంది. రమణ వాటిని నిజంపళ్ళనుకుని తినబోయాడు. శిల్పి చాతుర్యమతన్ని మోసగించింది.

కోపంతో అమ్మమ్మదగ్గరకు కథలకోసం చేరాడు. ముసలమ్మ కాళ్లుచాపుకుని ఆవలించింది.

"అమమ్మా! ఒకకథచెప్పవూ" అనడిగాడు.

"ఊఁ ..పోయిపడుకోరా - అస్తమానూ కథ

లేమిటి" అని ముసలమ్మ రోజూయిచ్చే ఉపోద్ఘాత మిచ్చింది.

"ఊ...చెప్పు" అని ముసలమ్మ వీపుమీద రెండు గుద్దులు గుద్దాడు.

"సరేలే...నన్ను చంపకు చెబుతా-కాని అడ్డు ప్రశ్నలువేసి విసిగించకు...అనగనగా శ్రీరాముడనే రాజుండేవాడు. ఆయన ప్రజలను సుభిక్షంగా పాలించేవాడు"

"అంటే?" రమణ అర్థంకాని చూపులు చూశాడు. అంతపెద్దమాట ఉపయోగించినందుకు నొచ్చుకుంది ముసలమ్మ.

"అంటే-ప్రజలందరికీ తినటానికి అన్నం-కట్టుకోటానికి మంచిబట్టలు ఇచ్చేవాడన్నమాట చాలామంచిరాజు."

"మామ్మా! నేనూ రాజునౌతా నే-ఎంచక్కా-దాచ్చపప్పు, లడ్డూలూ అన్నీ తినొచ్చు. అందరూ నాయిష్టం వచ్చినట్టు చేస్తారు...అవునా?" అని ముద్దుమాటలు కురిపించాడు.

"మానాయనవి. రాజాధిరాజు వవుతావు" అని మనవణ్ణి ముద్దుపెట్టుకొని తిరిగి ప్రారంభించింది.

"నీలాగే ఉన్నప్పుడు చిన్నప్పుడు శ్రీరాముడు చందమామ కావాలని మారాంచేశాడు. చందమామతో ఆడుకుంటాను. తెచ్చి పెట్టండి అన్నాడు...చందమామను ఎలా తెస్తారు చెప్పు?"

"విమానాలమీద వెళ్ళి తేలేరే? అబ్బ! ఈ కతొద్దే...మరోకతచెప్పు" అని మారాం చేశాడు. ముసలమ్మ మరోకథ ప్రారంభించింది.

"అనగనగా ఓ మంచి రాజుండేవాడు. ఆయన అందర్నీ బాగా పరిపాలించేవాడు ఓ నాడు అర్థరాత్రి పెద్దకేక వినిపించింది. అదేమిటనుకున్నావు? ఆ ఊరికి ఓ రాక్షసుడు వచ్చాడు. వాడు తాటిచెట్టంత ఎత్తున్నాడు. పెద్దపెద్ద కోరలు. ఎర్రటి కళ్లు - అందర్నీ పరపర నమిలి మింగేసేవాడు. చాలాభయంకరంగా వుండేవాడు"

"నాకు భయమేస్తోంది. ఆ కథొద్దే"అని రక్షణకోసం ముసలమ్మ ఒడిలోకి చేరాడు. ఇంతలో రమణ తండ్రి వచ్చాడు.

"వెధవ కథలు. కుర్రాళ్లు జడుసుకునే కథలు చెబుతారా? ఇలాగే కుర్రాళ్ళను చెడగొట్టడం. మంచి కథలు లేవూ?"అని ముసలమ్మకేసి కొర కొర చూశాడు రమణ తండ్రివద్దకు పరుగెత్తాడు.

"నాన్నా! లాచ్చచులంటే నాకు భయమేస్తోంది. మొన్న దెయ్యాల కధ చెప్పింది, నిన్న అన్నం తినకపోతే అమ్మ బూచాడికిచ్చేస్తానంది. నిన్నరాత్రి మనింటిదగ్గరకు బూచాడొచ్చాడు నాన్నా! ఆ చెట్టుదగ్గర నిలబడ్డాడు" అన్నాడు భయంతో రమణ.ఆచెట్టుదగ్గర చీకటిఆవరించింది.

"ఇలాగే కుర్రాళ్ళను తగలేయటం. చిన్నప్పటినుండి లేనిపోనివన్నీ చెప్పి భయపెట్టడం-ఆఖరికి ఎందుకూ పనికిరానివాడిగా చేసి లోకంమీదికి వదిలేయటం. బూచాడులేడురా బాబూ! ఊరికే నిన్ను ఏడిపించటానికి అంటున్నారు"అని కొడుకునెత్తుకుని బుజ్జగించాడు తండ్రి.

* * *

ఇప్పుడు రమణకు పదహారేళ్లు. చిన్ననాటి స్మృతులలో కొన్ని సిమెంటు కట్టడంలా నాటుకుపోయాయ్.

మొన్న రమణ తండ్రి పనిచేసే ఆఫీసు మేనేజరుగారురమ్మాయికి పుట్టినరోజు పండుగయింది. రమణ, వాళ్ళ నాన్నా వెళ్ళారు. మేనేజరిల్లెంత బాగుంది? అందమైన అద్దాల తలుపులు సూర్య రశ్మికి మెరుస్తున్నయ్. రవివర్మ పటాలు శోభను సమకూర్చాయి. ఆ మేనేజరు కొడుకు ఇంట్లో కూడా పట్టుబట్టలు కట్టుకుని తిరుగుతున్నాడు. అతను రోజూ అంతేనట. కాని తనో? ఇంట్లో ఉన్నంత కాలం మురికితువ్వాలు కట్టుకుని స్కూలుకుపోయేటప్పుడు మాత్రం కాస్త మంచి బట్టలు వేసుకుంటాడు. ఆవేళ టీపార్టీలో తిన్న రుచిని జన్మలో మరవగలడా?

తనుకూడా అభివృద్ధిలోకి వస్తాడన్న ఆశ రమణలో నూటికి నూరుపాళ్లుంది. ఎదుట కనిపించే వెలుగంతా తనకు జ్ఞానయుగానికి ఆహ్వానిస్తున్నట్టుగా కనిపించింది. కాని అది వేదాంతపు వెలుగని ఎన్నడు గ్రహిస్తాడో? అతను సిల్కు-బట్టలు వేసుకు తిరుగుతాడు. ఎప్పుడూ ఓవల్టిన్ తాగుతాడు. వేలికి బంగారుగొలుసుతో వాచీపెట్టుకుంటాడు. ట్వీడ్ సూట్ వేస్తాడు. పాతికరూపాయల బాటా బూట్స్ కొని టకు టకుగా నడుస్తాడు. తలిదండ్రుల్ని పువ్వుల్లోపెట్టి పూజిస్తాడు. ఇంటినిండా నౌకర్లే! భవిష్యత్తును మనసులో ముద్రించుకుని మురిసిపోయేవాడు.

అంతా బాగుంది. కాని ఓ చిన్న చిక్కు వచ్చి పడింది. పైచదువు చదివితేనేకాని మేనేజరు పదవిరాదు. పై చదువుకు డబ్బులేదు. తండ్రి సముద్రం మధ్యలోపడి కొట్టుకుంటున్నాడు. ఇంతలో ఆశ-తండ్రికి తనమీద ఆశుంది. చదివిస్తాడు-ఇంకా చదివిస్తాడు...కాని అంతవరకూ ఎందుకు? ముందు ఈ పబ్లిక్ పరీక్షలు ప్యాసవటమెలాగ? అనొక చిక్కయింది. పుస్తకాలు కొకొల్లగా ఉన్నాయి. జీవితపు విలువతో పుస్తకాల చదువుకొలిచి అవి నిష్ప్రయోజనమని వాగితే ఏం లాభం?

ఒకనాడు తండ్రి పిలిచి "ఒరే! నువ్వు టైపు నేర్చుకోవాలిరా. ఈ కాలంలో అదే ఇంత అన్నంపెట్టేది. ఆ నరసింహంగారు నిన్ను ఉదయము రమ్మన్నారు. వెళుతూండు" అన్నాడు. రమణ ఆ ప్రకారంగానే చేశాడు.

పబ్లిక్ పరీక్ష గుండుసున్నయింది. గోరీలా మరోదండయాత్రచేసి గెలిచాడు. టైపు రైటింగు పరీక్షక్కూడా వెళ్ళాడు. దబదబ బాదేశాడు. అదికూడా చెక్కేసింది. అసలు అతను వెళ్ళిన సెంటరుకి ప్యాసయింది ఒకడు! "ఎవరు చేసిన కర్మ..."అని పాటలు రేడియో పాడుతూంటే నిజమే ననుకున్నాడు. మళ్ళీ పరీక్షకు వెళ్ళాలంటే పాతికరూపాయలు కావాలి ఎలాగ?

* * *

కొన్ని పిశాచాలు వెన్నంటుతూనే వున్నాయి. మనస్సా భవిష్యత్తు ముందు కనిపించి మమతలు రేపుతోంది. ఒకనాడు స్నేహితుడి పెళ్ళికి వెళ్ళాడు. మిత్రుడి భార్యను చూడగానే ఒడలు పులకరించింది. తీర్చిదిద్దిన అవయవాలతీరు, ఆకర్షించే నేత్రాలు, గుండ్రటిముఖం, బంగారురంగు కాయం, అప్పుడే దిగిన అప్సరసలాగుంది. రమణ హృదయంలో చెడుతలపు ఏ కోశానా లేదు. తన మిత్రుడి అదృష్టరాజాన్ని అభినందించాడంతే-అతనిభవిష్యద్వృక్షం చిగిర్చింది. ఆ చెట్టుకు మెరిసే మణులే కాయలు.

తరువాత ఒకసారి వారిద్దరూ రిక్షాలో పోతుంటే చూచాడు. ఇద్దరిమధ్య ఎంత అవగాహన? సంతోషాన్ని ఇంకెవరికీ మిగల్చకుండా తాగేస్తున్నారు. మరోసారి సిల్కుపేలస్‌లో టిష్యూచీరలు కొంటుండగా చూచాడు. అంతే కాదు. తన భావి జీవితంమీద కూడా చకచకా సౌధాన్ని నిర్మించాడు. ఆ సౌధంలో అపురూప సుందరికి అగ్రాసనమిచ్చాడు. అలా...అలా... అలా...ఆనందసాగరంలో తేలిపోతాడు!

ఇప్పుడు రమణ యౌవ్వనంలో ఉన్నాడు. చిన్ననాటి కలలుకొన్ని పగటికలలయ్యాయి. అనుకొన్న ఏఆశయం సాధించలేకపోయాడు. పాతవి చస్తుంటే, మనుపుకి వస్తుంటే - కొత్తవి పుడుతున్నాయి.

ఎప్పటికైనా మేనేజరవుతాడనే ఆశ ఉంది. కాని త్వరలోనే హెడ్‌గుమాస్తాకావచ్చు. కాని వర్తమానానికి అతనొక టైపిస్టు.

అతనాశించినట్టుగా ఆప్సరసను వివాహమాడలేకపోయాడు. ఆ ఆశయంతో, ఎవరెస్టు శిఖరమెక్కాలన్న లక్ష్యంతో, వచ్చిన సంబంధాలన్నిటినీ త్రోసిపుచ్చాడు. "ఆ పిల్ల యెందుకు నచ్చలేద"ని తల్లి అడిగితే "ఆ పిల్ల నల్లగా వుంది. ఈ పిల్ల హంసగమన కాదు. మరో పిల్ల పిల్లి కళ్లు, కాలు వంకర, చెయ్యి వంకర" యిలాంటి కుంటి సాకులు చెప్పేవాడు. కాని తన "ఆశలు" వంకరవైనవని తెలుసుకోలేకపోయాడు. అందకత్తె కాదని తెలిసికూడా జీవిత సాగరాన్ని మథించిన మహామోహుడికి మల్లే సరళను పెళ్ళిచేసుకున్నాడు దాంపత్య జీవితం ఆదర్శంగా ఉంటుందని ఆశించాడు.

అనుకోకుండా రమణ జీవితంలో కొన్ని చిక్కులు వచ్చిపడ్డాయి. బ్రతకవలసినంత కాలం బ్రతక్కుండానే తండ్రి చనిపోయాడు. "హద్దు దాటి కష్టపడ్డాడుకనుక త్వరగా చనిపోయా"డని మనసును శాంతింప చేసుకున్నాడు. పోయిన తండ్రి ఊరికేపోక తన జ్ఞాపకార్థం కొన్ని అప్పులు కూడా మిగిల్చిపోయాడు. ఈ అప్పులన్నీ తీర్చవలసిన బాధ్యత తనమీద పడింది. లేకపోతే కుటుంబగౌరవం మంటగలుస్తుంది. స్వసుఖాన్ని బలిపెట్టి అప్పులుతీర్చటానికి నిర్ణయించికొని కదనరంగంలో దుమికాడు.

* * *

చింతలు పెరిగాయి కాని చితకలేదు. కూతురు కమలకప్పుడే పదమూడోయేడు దాటింది. పెళ్ళి చెయ్యాలి. లేకపోతే లోకమంతా కొరకొర చూస్తుంది. కాని కమలను శ్రీమంతుల యింట్లో

చేర్చాలి. అందుకే ఇంత కాలమాగాడు. అప్పుడు కాని మనఃశ్శాంతి ఉండదు. సాయశక్తులా యత్నించాలి. ఆ భయం భూతంలా పీడిస్తోంది.

కొడుకును పెద్దచదువు చదివించాలి. పెద్ద చదువు చదవకపోవటం వలన తను పడుతున్న యిక్కట్లు లెక్కకు మించిపోయాయి. తనకొడుకు నన్నా వృద్ధిలోకితీసుకురావాలి. అది తనకర్తవ్యం.

బ్రతుకే వెగటుగావుంది. అటు ఆఫీసు అధికారులంటే గడగడ-ఇటు సంసారపు భీకర నృత్యమంటే గడగడ-రెండువైపు కొట్టికొట్టి చేతులు వాచిపోయాయి

ఆఫీసునుండి యింటికివచ్చాడు. పాతకుర్చీలో ఘటాన్ని చేరవేశాడు. కాసేపు కూర్చున్నాడు. కాని ఆదరించేదెరు?

"సరళా!" అని పిలిచాడు. జవాబురాలేదు. ఆఫీసు అధికారిమీదున్న కోపమంతా భార్య మీదికి మళ్ళింది. "సరళా!" అని యిల్లు దద్దరిల్లేటట్టు మళ్ళీ పిలిచాడు. విసుగ్గా వంటింట్లోంచి "ఏమండీ?" అని సమాధానం వచ్చింది.

"వచ్చిగంటయింది. బండెడు చాకిరీచేసి వచ్చినవాడికి గుక్కెడు టీనీళ్లు పోసేవాళ్ళు లేరూ?" అనరిచాడు.

"సామగ్రి లేంది టీనీళ్ళు ఎలావస్తాయి?" అని సమాన బలంతో సమాధానం వచ్చింది.

"మొన్న నేగా పావలా పెట్టి టీపొట్లం, అయిదణాలు పెట్టి పంచదార కొనుక్కు వచ్చాను. పాపం పెరిగినట్టుగా పాలవాడిబాకీ పెరిగిపోతోంది. ఇదంతా ఏ వినాయకుడు మింగినట్టు?"

"ఆ...అంతా నేనే మింగాను. ఈ యిల్లు అందరికీ సత్రమేగా-వచ్చినవాళ్ళంతా సుష్టుగా తాగి తందనాలాడటానికి."

"ఛీ. నోర్ముయ్! అతివాగుడు. నా స్నేహితులు రెండురోజులున్నారనేగా నీ ఎత్తిపొడుపు? మొన్న మీ అక్కా బావా పొట్ట పగలేటు తిన్నారే! మరి అదో? రాక్షసకొంప ఎందుకొచ్చిన బ్రతుకు. అక్కడేమో ఎద్దులా చాకిరీ చేసిరావటం ఇక్కడికిరాగానే భారత యుద్ధం ప్రారంభం" వీధిలోకి వచ్చి కూర్చున్నాడు.

"మాలతీ! ఈ రిబ్బను ఎంతకొన్నావు?" అనడిగింది కమల.

"గజం ముప్పావలా-అంత ఖరీదైన దెందుకు? వద్దని చెప్పినా వినకుండా మానాన్న కొన్నాడు. ఇదొక్కటే కాదు. ఆకుపచ్చ-నీలం-మట్టిరంగులోవికూడా తెచ్చాడు" అని గర్వంగా చెప్పుకుంది మాలతి.

రమణ కమలముఖం చూచాడు. తనుకూడా తండ్రే! ఎన్నడైనా అంత ఖరీదైన రిబ్బను కూతురికి కొనిచ్చాడా? ఆ అమాయికహృదయం ఎంత తపిస్తోందో! తోటివాళ్ళు సింగారించుకుంటే ఆమెకా తలంపెందుకుండదు? కాని తను దరిద్రుడు. మామూలు రిబ్బను కొనివ్వటానికి కూడా తాహతు లేకపోయింది. మొండిజడ వేసుకుంటుంది పాపం!

"ఈనెల అమ్మాయికి మంచిజాకెట్టు, చీర కొనాలి" అనుకునేవాడు. కాని ఏనాడూ కార్యరూపం దాల్చలేదు. ఇక శ్రీమంతుడికిచ్చి పెళ్ళి చేయటమెలాగ?

"నాన్నా! స్కూలుజీతం కట్టాలి. ఆరునెలలయింది కాని ఇంకా లెక్కలపుస్తకం కొనలేదు." అని కొడుకు ఫిర్యాదుచేశాడు. రమణకు తల నేలవేసుకుని బాదుకోవాలనిపించింది. "చూద్దాంలే" అన్నాడు.

రమణ వీలైనప్పుడల్లా "అణా-బేడా", "బ్రాకెట్టు" ఆటకు దానంచేసేవాడు. దానివల్లనైనా ఏమైనా లాభం కలుగుతుందేమోనని. కాని అన్నీ నిష్ఫలమయ్యాయి

గుండెలో నీరింకుతోంది.

* * *

రమణ ఇప్పుడు వృద్ధాప్యంలో ప్రవేశించాడు. చర్మం ముడుతలు పడిపోయింది. తల నెరిసిపోయింది. శరీరంలో శక్తి దిగజారిపోయింది. పాత వూహాలు మెరపుల్లా పొడుచుకువచ్చిపిచ్చెత్తించేవి.

సముద్రపుతీరం చేరటానికి యత్నించి విఫలుడయ్యాడు. సముద్రంలో యీది తీరం చేరబోతుంటే మరోకెరటంవచ్చి సముద్రం మధ్యకు లాక్కుపోయింది. కూతురిపెళ్ళి ఏదో అయిందనిపించాడు. అనుకున్నట్టుగా శ్రీమంతుడికిచ్చి పెళ్ళి చేయలేకపోయాడు. తనకుమల్లే నికృష్టజీవితాన్ననుభవిస్తున్న ఒకజీవికి అందగట్టాడు.

ఒకనాడు కూతురు దగ్గర కెళ్ళాడు. రైల్లో టికెట్టు లేకుండానే వెళ్ళాడు. ఈ మధ్య ఈ

క్రొత్త పద్ధతి అలవర్చుకున్నాడు. ఖర్మం చాలక టికెట్టు కలెక్టరుచేతులో పడితే తప్పించుకొనే కొన్ని చిట్కాలుకూడా నేర్చుకున్నాడు, కూతురును చూచేసరికి అతనికి గుండె గతుక్కుమంది. చిక్కి చీపురుపుల్లయిపోయింది. తనబాధలు చెప్పుకుని తండ్రిదగ్గర గోలుగోలున ఏడ్చింది. భర్త తనని హింసిస్తున్న విధానాలన్నిటినీ వివరంగా చెప్పింది. అతనిగుండె వేయిముక్కలయింది. ఆశ సుడిగుండంలో చిక్కుకుంది. అల్లుడిమీద కోపం కట్టలుతెగి ప్రవహించింది. అన్నిటికీ మూలకారణం దరిద్రం. అతనుమాత్రమేంచేస్తాడు? దరిద్రమే లేకపోతే స్వర్గమెందుకు? రమణ మాత్రం సరళను ఎన్నివిధాల హింసించలేదు?

కూతురు కాపరం ఒకభీకరస్వప్నమైతే అతన్ని పీడించింది. కొడుకును అనుకున్నట్టుగా పెద్దచదువు చదివించలేకపోయాడు. అతనుకూడా తనలాగే గుమాస్తాగిరీ అఘోరిస్తున్నాడు. ఈ ముసలితనంలో కూడా రమణ కష్టపడవలసి వచ్చింది. ఉద్యోగంలోంచి రిటైరయ్యాడు. పెన్షనులేదు. ప్రవేట్లు చెప్పుకుంటున్నాడు అక్కడక్కడ... అవకాశం చిక్కినప్పుడల్లా వంట పనికి వెళుతున్నాడు—

రమణలో మరొక క్రొత్తఆశ పుట్టుకొచ్చింది. తనకొడుకుకు మంచి ఉద్యోగం దొరుకుతుందని అప్పుడు తనను పువ్వుల్లో పెట్టి పూజిస్తాడని ఆశ-అలాగే యీదులాడుతున్నాడు.

రమణ యిప్పుడు జీవితపు ఆఖరుదశలో ఉన్నాడు. కర్రలేనిదే అడుగైనా కదలలేడు. కూతురుకాపరం కుదుటపడలేదు. కొడుకు గుమస్తా ఉద్యోగంలోనే ఉన్నాడు. తండ్రి చనిపోయేటప్పుడు అతనికెంత అప్పుమిగిల్చాడో అంత అప్పూ కొడుక్కి మిగిల్చాడు రమణ.

మంచుకురుస్తోంది. బూజుపట్టిన కిటికీదగ్గర కూర్చున్నాడు రమణ. చల్లగాలి వీస్తోంది. తన కంటె ముసలిదైన కోటును దగ్గరగా లాక్కుని ముడతలు పడిన తనకాయాన్ని చలినుండి రక్షించుకోటానికి యత్నించాడు. అష్టకష్టాలుపడి కొండయెక్కి చివరకి కొండకొమ్మునుంచివచ్చిన దారిని చూసుకుంటున్నవాడిలా రమణ తన గడచిన జీవితాన్ని నెమరువేయసాగాడు. దీపంలో చమురు అయిపోతోంది. మరికాసేపట్లో దీపం ఆరిపోతుంది.

చిన్నతనంలో మహారాజునౌతానని అమ్మమ్మ దగ్గర అన్నాడు. అవాలని గాఢమైన వాంఛ కూడా హృదయంలో నాటుకుపోయింది. కాని యౌవ్వనంలో అది సడలింది. ఆఫీసు మేనేజరవాలని, కనీసం హెడ్ గుమాస్తా అయినా అవాలని వాంఛించాడు. కౌమారదశలో బ్రాకెట్టు సొమ్ము తెస్తుందనుకున్నాడు. వృద్ధాప్యంలో కొడుకు ఆదరిస్తాడనుకున్నాడు...కాని?

చిన్నతనంలో అద్దంలో చందమామనుచూచి నిజంచందమామని శ్రీరాముడు భ్రమించాడు. కర్రతో తయారైన ద్రాక్షపళ్ళనుచూచి నిజం పళ్ళనుకున్నాడు రమణ. విద్యార్థిదశలో కనిపించే వెలుగంతా తనభవిష్యత్తే. సంసారయాత్రలో అపారసౌఖ్యాన్ననుభవిస్తాడని ఆశించాడు. తన దాంపత్యం ఆదర్శప్రాయంగా ఉంటుందనుకున్నాడు...తనకు రంభలాంటి భార్య దొరుకుతుందనుకున్నాడు. తారుణ్యంలో మంచి దశ ఉందని భ్రమించాడు-కాని?

వృద్ధాప్యంలో కూతురి కాపరం, కొడుకు తనకు మల్లే నిరర్థకంగా అరవచాకిరీ చేయటం, అప్పులు పెరగటం-ఇవి జడిపించాయి. ఆఖరి పడిలో మరణమంటే మతి చెడుతోంది ఎందుకో? మృత్యుదేవతను చూచి భయపడ్డాడు. చిన్నప్పుడు చదువుకున్న బ్రౌనింగ్ ఫిలాసఫీ జ్ఞప్తికివచ్చింది.

“ముసలితనాని ఆహ్వానించు. నెరిసినతలంటే జీవితసాగరాన్ని మథించిన మేటివీరుడి చిహ్నం. యౌవ్వనంలో తప్పులు కుప్పతిప్పలుగా చేస్తావు. ముసలివాడంటే మహాజ్ఞానన్న మాట. ముసలితనం వచ్చిందికదా అని ఎందుకు భయం? మృత్యువును చూచికూడా భయపడొద్దు. చావు అనేది ఒక చిన్న నిద్ర”అని బోధించాడు ఆ మహాతత్వవేత్త!

ఇలాగే చిన్నప్పటినుండి, పుట్టినప్పటినుండి, ఆశాపాశాలు, భ్రమలు, ఎండమావులు, నీడల్లా వెన్నంటుతూనే వున్నాయి. రమణ కళ్ళల్లో నీళ్లు నిండాయి. దీపం సాంతమవుతోంది. దీపంలో చమురయిపోతోంది. కొన్ని క్షణాల్లో దీపమారిపోతుంది. రమణ ఇంట్లోకి వెళ్ళి రెండు చుక్కల నూనుంటే తీసుకొచ్చి దీపంలో పోశాడు. కాని అదిమాత్ర మెంతకాల ముంటుంది?